



గూడూరు మండలం తుంగపాళెం గ్రామం వద్ద కలర్‌షైన్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రదేశం ఇదే (ఫైల్)

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కనబడటం లేదు. ఎక్కడో ఒకచోట.. ఏదో ఒక ప్రమాదం జరుగుతూ కార్మికుల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పరిశ్రమ మనుగడకూ ఇబ్బందిగా తయారవుతున్నాయి. భద్రతా ప్రమాణాల డొల్లతనాన్ని బహిర్గతపరుస్తున్నాయి.

- తడ, ఆంధ్రజ్యోతి

పరిశ్రమల్లో భద్రత డొల్ల

- తరచూ ప్రమాదాలు
- ఉదాసీనంగా పరిశ్రమ వర్గాలు
- పట్టించుకోని అధికారులు

రాష్ట్రాభివృద్ధికి పారిశ్రామికీకరణ ఎంతో ముఖ్యం. ఆ ప్రకారం జిల్లాలో స్థాపితమైన శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు సెజ్‌లలో వందల పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఆయా పరిశ్రమల ద్వారా లక్ష మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించాయి. అంతవరకు బాగానే ఉన్నా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించడంలో మాత్రం యాజమాన్యాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. కొన్ని పరిశ్రమల్లో అయితే ఆ భద్రతా ప్రమాణాలు మచ్చుకైన కనపడని పరిస్థితి. తద్వారా ఏదో ఒక రూపంలో ఎక్కడో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దాంతో ఆయా ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయే కార్మికులే కాకుండా పరిశ్రమ మనుగడకు ఇది ఇబ్బందిగా మారుతుంది.

ఇటీవల జరిగిన ప్రమాదాలివీ

- ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన పెళ్లకూరు మండలం పెన్నేపల్లి సమీపంలోని అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో ఫర్నేస్ ఆయిల్ బాయిలర్ తీవ్రమైన ఒత్తిడికి లోనై పేలిపోవడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు సిపాయిలాల్, సోనూమహ్మద్ మృతిచెందారు. మరో 8 మంది వరకు గాయపడ్డారు.
- జూన్ 26వతేది ఇదేపరిశ్రమలో మరోసారిఅగ్ని ప్రమాదం జరిగి జూరాల యాదవ్ అనే కార్మికుడు మృతి చెందాడు.
- గూడూరు మండలం తుంగపాళెం గ్రామం వద్ద ఉన్న కలర్‌షైన్ పరిశ్రమలో ఈనెల 13వ తేదీ జింక్‌ట్యాంక్ బాయిలర్ పేలిపోయిన దుర్ఘటనలో ఆదిత్యకుమార్ అనే కార్మికుడిపై జింక్ ద్రావణం పడింది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందగా, మరో 10 మంది వరకు గాయపడ్డారు.
- 2023లో ఓజిలి మండలం పెద్దపరియ గ్రామ సమీపంలోని నెల్‌క్యాస్ట్ పరిశ్రమలో ఫర్నేస్ ఆయిల్ బాయిలర్ పేలి సిలిండర్లపై పడ్డాయి. అవి పేలిపోయి ఆ పక్కనే విధుల్లో ఉన్న ఇద్దరు కార్మికులు అక్కడిక్కడే మృతి చెందగా, మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు.
- ఏడాది క్రితం మాంబట్టు సెజ్‌లోని డాల్మియా పరిశ్రమకు సమీపంలోని అనధికార పరిశ్రమల వ్యర్థాల డంప్‌లో అగ్నిప్రమాదం జరగడంతో అగ్నిమాపక సిబ్బంది సుమారు 10 ఫైర్ ఇంజన్లతో రెండు రోజులపాటు తీవ్రంగా శ్రమించి ఆ మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో డాల్మియ పరిశ్రమకు కొంత నష్టం వాటిల్లింది.
- తాజాగా గురువారం.. ఏర్పేడు మండలం వికృతమాల రెవెన్యూ పరిధిలోని మునోత్ లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆ సమయంలో పరిశ్రమలో కార్మికులెవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. రూ.65 కోట్లకుపైగా ఆస్తినష్టం జరిగినట్లు భావిస్తున్నారు.
- ఇక, మేనకూరు సెజ్‌లోని అరబిందో పరిశ్రమలోని గ్రాన్యూలేషన్ విభాగంలోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సుమారు రూ.15 కోట్ల ఆస్తినష్టం జరిగింది. అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు.



ఏర్పేడు మండలం వికృతమాలలోని మునోత్ పరిశ్రమలో గురువారం నాటి ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఉదాసీనంగా పరిశ్రమ వర్గాలు

పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై కార్మిక, రెవెన్యూ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. జాతీయ భద్రతా సూచనలకు అనుగుణంగా ఆ పరిశ్రమ ఉందా లేదా అన్నది నిర్ధారించాలి. అలాగే బాయిలర్లు తీవ్ర ఒత్తిడితో ఉండే ట్యాంక్‌ల నాణ్యతా ప్రమాణాలను ప్రతి 6 నెలలకోసారి ఆయా సంస్థలు తనిఖీచేసి వాటి ఫిట్‌నెస్‌ను నిర్ధారించాలి. అలాగే ఐఎస్ఐ, ఐఎస్‌వో వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థలు కూడా పరిశ్రమ భద్రతా ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని ఆమేరకు సర్టిఫికెట్లను మంజూరు చేయాలి. ఇలా భద్రతపై అటు ప్రభుత్వాలు, ఇటు ప్రభుత్వేతర సంస్థలు ధ్రువీకరించాకే ఆ పరిశ్రమ నడవాల్సి ఉంటుంది. కానీ, ఇన్ని నియమాలను, తనిఖీలను పరిశ్రమలు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. వీటిని ధ్రువీకరించి సర్టిఫికెట్లు మంజూరు చేసే సంస్థలు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఇలా మొక్కుబడిగా తనిఖీలతో సర్టిఫికెట్లను మంజూరు చేయటంతోనే ఇటువంటి ప్రమాదాలకు మూలంగా కనబడుతోందన్న ప్రచారం జరుగుతోంది. భద్రతలోపాలు బయటపడకూడదనే ఉద్దేశ్యంతో కొన్ని పరిశ్రమలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లో అగ్ని ప్రమాదమని చెప్పడం సాధారణమైందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే ఒక విద్యుత్ ప్యానల్ బోర్డులోని వైర్లలో చిన్నపాటి లోపం ఏర్పడిన వెంటనే వాటిని నియంత్రించేలా ఏర్పాటు చేసే రిలే యూనిట్ల ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగదు. ఒక వేళ అలా ప్రమాదం జరిగితే ఆ రిలేలు చెడిపోయేస్థితిలో ఉండటమో, నాణ్యతా ప్రమాణాలు లేని రిలేలను వినియోగించడంతోనే ఇటువంటి షార్ట్‌సర్క్యూట్‌లు జరుగుతుంటాయి. మచ్చుకు ఇది ఒక ఉదాహరణమాత్రమే. ఇలా ఇటువంటి ప్రమాదాల నేపథ్యంలో అధికారులు పరిశ్రమల్లో నిరంతరంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రమాదం జరిగిన రెండు, మూడు రోజులపాటు హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోకపోవడంతోనూ ఇలాంటి ప్రమాదాలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయని చెప్పవచ్చు.

నేడు కలెక్టర్‌కు స్కోచ్ పురస్కారం



తిరుపతి(కలెక్టరేట్),సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ ఢిల్లీలో శనివారం స్కోచ్ పురస్కారం అందుకోనున్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి న్యూఢిల్లీకి చెందిన స్కోచ్ సంస్థ ఏటా పురస్కారాలు అందజేస్తోంది. చంద్రగిరి నియోజకవర్గం స్వర్ణనారావారిపల్లె కింద సి.రామాపురం, కందులవారిపల్లె, రంగంపేట పంచాయతీల్లో 45 రోజుల్లో 1,600 గృహాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసినందుకు గాను కలెక్టర్ ఈ పురస్కారం అందుకోనున్నారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో మోసం

- రూ.13.5 లక్షల స్వాహా

తిరుచానూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీతో భారీ ఆదాయం వస్తుందని నమ్మించి రూ.13.5లక్షలు కాజేసిన ఘటన తిరుచానూరులో శుక్రవారం చోటుచేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. తిరుచానూరు వసుంధరనగర్‌కు చెందిన హిమసాగర్ చిన్న ప్రైవేటు కంపెనీ నిర్వహిస్తున్నారు. అతడి తండ్రి టీటీడీ ఉద్యోగి. చైతన్యపురం గజలక్ష్మి గ్రీన్‌సిటీ వద్ద నివాసం ఉంటున్న ఉత్కర్ష్ రామాయణం హిమసాగర్‌కు స్నేహితుడు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే షేర్స్ తరహాలో భారీ ఆదాయం వస్తుందని హిమసాగర్‌ను నమ్మించాడు. ఉత్కర్ష్ రామయణం ఓ ఖాతా నెంబరు చెప్పి అందులో డబ్బు జమ చేయాలని సూచించాడు. హిమసాగర్ రూ.13.50 లక్షలు సదరు ఖాతాకు జమ చేశారు. నెల రోజులైనా డబ్బు తిరిగి రాకపోవడంతో హిమసాగర్ ఉత్కర్ష్ రామాయణాన్ని నిలదీశారు. తనకు సంబంధం లేదని చెప్పడంతో బాధితుడు శుక్రవారం రాత్రి తిరుచానూరు పోలీసులను ఆశ్రయించారు. ఉత్కర్ష్ రామాయణంపై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. క్రిప్టో కరెన్సీ, షేర్ మార్కెట్స్, బిట్‌కాయిన్స్‌తో అధిక లాభాలు వస్తాయని చెప్పే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.



టీడీపీలోకి ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి



ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబునాయుడు

తడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి టీడీపీలో చేరారు. అమరావతిలో శుక్రవారం ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడును కలవగా, ఆయన పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కాగా, కళ్యాణ్‌చక్రవర్తి తండ్రి బల్లి దుర్గాప్రసాద్ 2019 ఎన్నికలకు ముందు వరకు టీడీపీలో ఉన్నారు. టీడీపీ నుంచి గూడూరు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల సమయంలో టీడీపీని వీడి వైసీపీలో చేరి తిరుపతి ఎంపీగా గెలుపొందారు. 2020లో ఆయన మృతి చెందడంతో ఆయన కుమారుడైన బల్లి కళ్యాణ్ చక్రవర్తికి వైసీపీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి తరువాత ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి తన పదవికి రాజీనామా చేస్తూ శాసనమండలి చైర్మన్‌కు సమర్పించారు. ఆ రాజీనామా ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. అప్పటి నుంచి ఆయన టీడీపీతో సఖ్యతగా ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, సూళ్లూరుపేట, గూడూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్, పులిపర్తి నాని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

పిడుగుపడి రైతు కూలీ మృతి

నాయుడుపేట టౌన్ ఆంధ్రజ్యోతి: నాయుడుపేట మండలం కలిపేడు పంచాయతీ గంగమ్మకట్ట కాలనీకి చెందిన శివయ్య(22) పిడుగుపడి మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగుపడటంతో అక్కడిక్కడే చనిపోయారు.



చేపలమార్కెట్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

తిరుపతిలో కుండపోత

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ద్రోణి ప్రభావంతో తిరుపతిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వాన పడింది. వీధులన్నీ నదులను తలపించాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.



నగరంలో పడుతున్న వర్షం

బతుకు బండి బలి తీసుకుంది

- ట్రాక్టర్ తిరగబడి రైతు కూలీ మృతి





బోల్తా పడ్డ ట్రాక్టర్ కింద ఇరుకుపోయిన బత్తెయ్య, మృతి చెందిన బత్తెయ్య

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి రైతు కూలీ, డ్రైవర్ బత్తెయ్య(48) మృతి చెందారు. తొట్టంబేడు మండలం పూడి కొత్త దళితవాడకు చెంది బత్తెయ్య వ్యవసాయ కూలీ. అదే గ్రామంలోని ఓ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పొలం పనులు చేస్తూ జీవనం సాగించేవారు. శుక్రవారం సాయంత్రం వరి నాటేందుకు ట్రాక్టర్‌తో బత్తెయ్య అడుసు దున్నే పనులు చేపట్టారు. బురదలో ట్రాక్టర్ చక్రం చిక్కుకుపోవడంతో బయటకు తీసే క్రమంలో ఒక్కసారిగా ఇంజిన్ తిరగబడింది. ట్రాక్టర్ కింద బత్తెయ్య చిక్కుకుపోవడంతో బురదలో కూరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తిరుచానూరుపై చిన్నచూపేల?

వసతుల కల్పనలో టీటీడీ శీతకన్ను





మూతబడిన మరుగుదొడ్లు - క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

(తిరుచానూరు, ఆంధ్రజ్యోతి)

శ్రీవేంకటేశ్వరుడికి ఇష్టసఖి పద్మావతీ దేవి. భక్తులు కూడా అమ్మవారికి అంతే ప్రాధాన్యమిస్తారు. కానీ, టీటీడీ మాత్రం తిరుమలపై పెట్టిన శ్రద్ధ తిరుచానూరు మీద పెట్టడం లేదు. తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకోవడానికి రోజూ సగటున 30వేలమందికి పైగా భక్తులు వస్తున్నారు. పదేళ్ల క్రితంతో పోలిస్తే ఈ సంఖ్య రెండింతలు పెరిగింది. అయితే ఇందుకు దీటుగా ఆలయం వద్ద వసతులు మాత్రం పెరగలేదు. తమిళనాడు నుంచి వచ్చే భక్తులు తిరుచానూరులో బసచేసి అలిమేలు మంగమ్మను దర్శించుకున్న తర్వాతే తిరుమల వెళ్తుంటారు. అయినా ఇక్కడ కల్యాణ మండపాలు తప్ప ప్రయివేటు లాడ్జీలు కూడా పెద్దగా లేవు. భక్తులు మాడవీధుల్లోనే నిద్రిస్తున్నారు. మరికొందరు తోళప్ప గార్డెన్‌లోని కల్యాణ మండపాల ముందు రోడ్లపై సేదతీరుతున్నారు. మాడవీధుల్లో రాత్రి సమయాల్లో ఆకతాయిలు ద్విచక్ర వాహనాలతో దూకుడు ఫలితంగా నిద్రిస్తున్న భక్తులు గాయపడిన ఘటనలు ఉన్నాయి.

పరాయిదైపోయిన పద్మావతి

తిరుచానూరులో భక్తులు బసచేసే ఏర్పాటు ఉంటే తిరుమల మీద ఒత్తిడి కూడా కొంత తగ్గుతుంది. బహుశా ఈ ఆలోచనతోనే ఐదేళ్ల కిందట రూ.100కోట్ల వ్యయంతో పద్మావతి నిలయాన్ని నిర్మించారు. 200 గదులతో నిర్మించిన ఈ భారీ భవనాన్ని భక్తుల వసతి కోసం అందుబాటులోకి తీసుకురాకుండానే ఇతర అవసరాలకు వాడుతున్నారు. కొవిడ్ సమయంలో దీనిని రోగులకు కేటాయించారు. ఆ తర్వాత ఏకంగా జిల్లా కలెక్టరేట్‌గా మార్చేశారు. నిజానికి ఇంత భవనం కలెక్టరేట్‌కి అవసరం కూడా లేదు. కొన్ని గదులు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి.

కదలని క్యూకాంప్లెక్సు నిర్మాణం

వేలాది మంది భక్తులు క్యూలైన్లలో అవస్థలు పడడం ఇక్కడ సాధారణమైపోయింది. ఉదయం, సాయంత్రం నైవేద్య నివేదన సమయంలో దర్శనానికి అనుమతించరు. ఈ సమయంలో భక్తులు వేచి ఉండేందుకు వెయిటింగ్ హాల్ లేదు. దీంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూనే ఉండాలి. ఒక్కోసారి క్యూలైన్లు నిండి మాడవీధుల్లో భక్తులు చొచ్చుకుని వచ్చేస్తారు. ఒక్కసారిగా లైను వదిలినపుడు తోపులాటలు, తొక్కిసలాటలు చేసుకుంటున్నాయి. ఏడాదిన్నర కిందట టీటీడీ రూ.20కోట్లతో ఆలయ సమీపంలోని గేట్ నెంబరు-4 వద్ద ఎకరా స్థలంలో నాలుగు అంతస్థులతో క్యూకాంప్లెక్సు నిర్మించాలని సంకల్పించింది. పాతభవనాలను కూల్చివేసి స్థలాన్ని చదును కూడా చేశారు. అంతే ఆ తర్వాత నిర్మాణం ముందుకుసాగలేదు.

'మరుగు' కష్టాలు

తిరుచానూరు ఆలయ పరిసరాల్లో మరుగుదొడ్లు లేవు. గేట్ నెంబరు-2 వద్ద పంచాయతీ నిర్మించిన మరుగుదొడ్డే భక్తులకు దిక్కవుతోంది. గేట్ నెంబరు-4 వద్ద మరుగుదొడ్డి నిర్మించినా ఇంజనీరింగ్ శాఖ మూసివేసింది. ఇది మందుబాబులకు ఆవాసంగా మారింది.



చంద్రగిరి

జనసేన పార్టీలో చేరిక



కోటేశ్వరనాయుడు, అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దేవర మనోహర్

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లెకు చెందిన గుత్తా కోటేశ్వరనాయుడు, ఆయన అనుచరులు జనసేన తిరుపతి రూరల్ మండలాధ్యక్షుడు పగడాల యువరాజ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. శుక్రవారం చంద్రగిరిలోని పార్టీ కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దేవర మనోహర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తిరుపతి రూరల్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు గుత్తా కోటేశ్వరనాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ఫూర్తితో పార్టీలో చేరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గోపిరాయల్ పాల్గొన్నారు.

జోనల్ పోటీలకు 163 మంది ఎంపిక



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జోనల్‌స్థాయి క్రీడా పోటీలకు 163 మంది విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ శివకుమార్ తెలిపారు. మండలంలో శుక్రవారం కుప్పం బాదూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో 291మంది పాల్గొనగా 163మంది జోనల్ లెవల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంఈవోలు మార్కొండయ్య నాయుడు, జయవేలు మాట్లాడుతూ క్రీడలతో మెరుగైన ఆరోగ్యం, స్నేహపూర్వకంగా మెలగడం వంటి లక్షణాలు పెంపొందుతాయన్నారు.

'ఎర్ర'స్మగ్లర్ అరెస్టు.. ఐదు దుంగల స్వాధీనం



స్మగ్లర్‌ను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీ ప్రాంతంలో శుక్రవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ కే అల్లీబాషా బృందం రాజంపేట రోళ్లమడుగు ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహించారు. పుట్టంగి మడుగు ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ వారికి కనిపించారు. పోలీసులను చూసి వారు పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి ఒకరిని పట్టుకోగలిగారు. అతను తమిళనాడుకు చెందినవాడిగా గుర్తించారు. స్మగ్లర్‌ను దుంగలతో సహా టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఎస్వీయూ సామాజిక విభాగం విద్యార్థుల ప్రదర్శన

రామచంద్రాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఎస్వీయూ సామాజిక విభాగం అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ కుసుమ అన్నారు. మండలంలో పది రోజులుగా సామాజిక విభాగాధిపతి జానకిరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. విద్యార్థులు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్లు వెంకటేశ్వర్లు, బొల్లినేని ముకుందనాయుడు, రమణయ్య పాల్గొన్నారు.

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ కాలనీలో గురువారం రాత్రి కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. తిరుచానూరుకు చెందిన విజయ్ కుటుంబ సభ్యులతో కలసి నగర శివారులోని హోటల్‌కు వెళ్లారు. అక్కడ భోజనం చేసి, తిరిగి వస్తుండగా జిల్లా ఖజానా కార్యాలయం వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో అతనితోపాటు భార్య లక్ష్మికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రుయాకు తరలించినట్లు సీఐ చెప్పారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదూ అందలేదని చెప్పారు.

22 నుంచి ఉగ్రప్రత్యంగిరాకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ సమీపంలో గల ఉగ్ర ప్రత్యంగిరాకాళి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 22న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 4న అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

రేపు వృద్ధులకు ఉచిత డెమెన్షియా స్క్రీనింగ్ క్యాంప్

చంద్రగిరి, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింగాపురంలో వృద్ధులకు ఆదివారం ఉచితంగా డెమెన్షియా స్క్రీనింగ్ క్యాంప్(చిత్త వైకల్యం) నిర్వహించనున్నట్లు శ్రీదేవరాజ్ యవర్స్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డివారి నాదమునిరెడ్డి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఇటువంటి సమస్యతో బాధపడుతున్నట్లయితే సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు చంద్రగిరి మండల సమావేశం

చంద్రగిరి, సెప్టంబరు 19(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన ఉదయం 10.30 గంట లకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతిధులు హాజరు కావాలని కోరారు.

రావి సుధాకర్‌చౌదరికి సన్మానం



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం సిస్త(ది సౌత్ ఇండియన్ షుగర్ కేన్ అండర్ షుగర్ టెక్నాలజిస్ట్ అసోసియేషన్) 54వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చక్కెర పరిశ్రమలో విశేష సేవలందిస్తున్న నెల్లూరుకు చెందిన రావి సుధాకర్‌చౌదరిని ఘనంగా సన్మానించారు. షుగర్ కేన్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఛైర్మన్‌గా ఆయన చక్కెర పరిశ్రమ అభివృద్ధికి చేసిన కృషిని పలువురు ప్రశంసించారు. అవార్డులు, బహుమతులు ప్రదానం చేశారు.

డ్వాక్రా యాప్‌తో సంఘం లెక్కలకు భద్రత



ర్యాలీని ప్రారంభిస్తున్న శోభన్‌బాబు, ఏపీఎం నాగేశ్వరరావు

తిరుపతి రూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన మనడబ్బులు-మనలెక్కలు మొబైల్ యాప్ ద్వారా డ్వాక్రా సంఘాల రుణాలు, చెల్లింపుల లెక్కలకు భద్రత ఉంటుందని వెలుగు(డీఆర్‌డీఏ) జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టీఎస్ శోభన్‌బాబు పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె, పేరూరు గ్రామ సమాఖ్య స్థాయిలో శుక్రవారం యాప్‌పై డ్వాక్రా మహిళలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులకు సంబంధించి లెక్కల్లో తప్పులు ఉంటే గ్రీవెన్స్ రైజ్‌చేసి సమస్యను పరిష్కరించు కోవచ్చన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాలను వినియోగించుకుని వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. డీపీఎంఐబీ వెంకటేష్, మండల ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.2.39 కోట్లు

ఐరాల(కాణిపాకం): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి హుండీ ద్వారా రూ.2,39,09,202 ఆదాయం లభించింది. శుక్రవారం ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో హుండీ కానుకలను లెక్కించారు.

రూరల్‌లో ఈ-పంట నమోదులో జాప్యం..!

● 20శాతం దాటని ఎల్‌పీ నంబర్ల నమోదు ● రైతులూ చొరవ చూపాలని కోరుతున్న అధికారులు



నలమానికాలువ గ్రామంలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పర్యవేక్షిస్తున్న మండల వ్యవసాయాధికారి సుబ్బారావు

తిరుపతిరూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో డిజిటల్ ఈ-పంట నమోదు నత్తనడకన సాగుతోంది. మండల పరిధిలో 29 రెవెన్యూ గ్రామాలకిగాను నాలుగు గ్రామాలలో సాగులేని కారణంగా నాన్ అగ్రికల్చర్ ఏరియా కింద పరిగణించారు. మిగిలిన 25 గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చేయాలి. వీటిలో కేసీపేట అన్‌సెటిల్డ్ విలేజ్‌గా నమోదై ఉంది. ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగ, చెరకు, ఫాడర్(గడ్డి), ఉద్యాన పంటలుగా మామిడి, కూరకాయలు సాగు చేస్తున్నారు. మొత్తంగా మండలంలో దాదాపు 1700 ఎకరాల్లో అగ్రి, హార్టికల్చర్‌కి సంబంధించిన పంటలను సాగు చేస్తున్నారు. కాగా ఖరీఫ్ సీజన్ మొదలై నాలుగునెలలు కావస్తున్నా ఈ-క్రాప్ నమోదులో జాప్యం జరుగుతోంది. ఓ పక్క క్షేత్రస్థాయిలో సిబ్బంది(వీఏఏ) కొరత.. మరోపక్క రైతులు పెద్దగా చొరవ చూపకపోవడంతో నమోదులో వెనుకంజలో ఉన్నారని తెలిసింది. ఐదుగురు వీఏఏలకు గాను ఇటీవల వరకూ ఇద్దరు సిబ్బంది హార్టికల్చర్ విభాగంలో పనిచేశారు. మిగిలిన ముగ్గురితోనే ఈ క్రాప్ నమోదు చేయాల్సి రావడంతో కొంత ఆలస్యమయిందని అధికార వర్గాలు అంటున్నాయి. రైతులు కూడా చొరవతీసుకుని సహకరించాలని కోరుతున్నారు. కాగా పంటల సాగు నమోదును ఈనెలాఖరుకు, ఎల్‌పీ నంబర్ల నమోదును వచ్చే నెలాఖరుకు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. గడువులోపు నమోదు పూర్తికాకపోతే రైతులు అన్ని విధాలుగా నష్టపోవాల్సి వస్తుంది.

సకాలంలో లక్ష్యాన్ని పూర్తిచేస్తాం

ఇప్పటికే పంటల నమోదు 90శాతం పూర్తిచేశాం. ఎల్‌పీ నంబర్లను అక్టోబరుకు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. రైతులు కూడా సహకారం అందించాలి.

- సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి

దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్స్ పెన్‌డౌన్



చంద్రగిరిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్స్

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది శుక్రవారం పెన్‌డౌన్ చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దస్తావేజు లేఖరుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీఎం కేశవులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల వల్ల దస్తావేజు తయారీ కష్టతరం, జాప్యమవుతోందన్నారు. తద్వారా రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు, దస్తావేజు లేఖరులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆ విధానాల్లో మార్పు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు శిరీష్‌రెడ్డి, గోపి, పాటూరు జయచంద్ర, శ్రీనివాసులు, బాస్కర్, శ్రీకాంత్, రాము, వాసు, సిద్దయ్యనాయుడు, ఉషారాణి, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ధ్యాన మార్గంతో మోక్షం



సందేశాన్ని వినిపిస్తున్న రమ్యానంద భారతి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ధ్యాన మార్గాన్ని అనుసరించి తద్వారా మోక్షం పొందాలని శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి అన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో జరుగుతున్న ధ్యాన మహాయజ్ఞం కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు శుక్రవారం ఆమె పాల్గొని మాట్లాడారు. తరతరాలుగా, యుగయుగాలుగా మన ధర్మాన్ని, దేశాన్ని, మానవాళిని ధ్యానం రక్షిస్తోందన్నారు. దేవతలు, రుషులు, మునులు ధ్యాన మార్గాన్ని అనుసరించి శక్తిని సంపాదించారని తెలిపారు. అంతకు ముందు శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివ, రాయచోటి సీనియర్ పిరమిడ్ డి.సతీష్ తమ సందేశంలో ధ్యానం చేస్తే అజ్ఞానం దగ్ధమవుతుందని, శరీరంలోని కణాల శుద్ధి జరుగుతుందని వివరించారు. అనంతరం సామూహిక అఖండ సంగీత నాద ధ్యానం మూడు గంటల పాటు సాగింది. ఈ కార్యక్రమంలో పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ కుమార్, ధ్యాన మహాయజ్ఞం కమిటీ వైస్ ఛైర్మన్ సంగీతబాబు, పీఎంసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సేత్ బాలకృష్ణ, పులి రామ్మోహన్‌రావు, బండి శ్రీనివాసరావు, కృష్ణమోహన్, మహేశ్వరి పాల్గొన్నారు.

మందుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి



రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రోగులకు ఇచ్చే మందుల విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు అన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో 5వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్యంతోపాటు వారికి ఇచ్చే మందుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వైద్యాధికారులు, వైద్య విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రొఫెసర్ భారతి పాల్గొన్నారు. ఇదే కార్యక్రమాన్ని స్విమ్స్‌లో ఫార్మకాలజీ విభాగం, ఏఎంసీ డిప్యూటీ కోఆర్డినేటర్ పల్లవి ఆధ్వర్యంలో నిర్వహించారు. డీన్ అలోక్ సచిన్, ప్రొఫెసర్లు సుభాష్, విజయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు భద్రతపై అవగాహన



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న పోలీసులు, డాక్టర్

తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు తిరుమల పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు. టూటౌన్ సీఐ శ్రీరాముడు, ఇతర పోలీసు అధికారులు పారిశుధ్య కార్మికులతో ఆస్థాన మండపంలో సమావేశమై తిరుమల భద్రతలో వారి పాత్రపై కొన్ని సూచనలు చేశారు. టాయిలెట్లు, చెత్తకుండీల వద్ద అనుమానాస్పద వస్తువులు, పదార్థాలు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, భద్రతా సిబ్బందితో అనుసరించాల్సిన తీరు, అగ్నిప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముంటే స్పందించాల్సిన విధానం, భక్తులతో ఎలా మెలగాలి వంటి వివిధ అంశాలపై సూచనలు చేశారు. తిరుపతికి చెందిన డాక్టర్ ప్రసాద్ సీపీఆర్ ప్రాధాన్యత, అవసరమైన సందర్భాల్లో ఎలా అమలు చేయాలనే విషయాలపై డెమో ఇచ్చారు. ఈ సమావేశంలో ఫైర్, హెల్త్, విజిలెన్స్ బాంబ్ స్క్వాడ్, ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రైలు కిందపడ్డ స్నేహితులు

పూతలపట్టు యువకుడి మృతి, మరొకరి పరిస్థితి విషమం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):హోటల్లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఇద్దరు యువకులు రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది.పూతలపట్టుకు చెందిన జి.ఉమేష్ చంద్ర(24), నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరు పంచాయితీకి చెందిన పి.వంశీ నెల్లూరు నగరం హరనాథపురంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి వీరిద్దరూ బర్త్ డే పార్టీ అంటూ యజమాని వద్ద రూ.2 వేలు తీసుకుని బయటకు వచ్చారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ గురువారం వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే ఎస్ఐ ఎస్ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంఘటనా స్థలంలోనే ఉమేష్‌చంద్ర మృతి చెందగా, అపస్మారక స్థితిలో ఉన్న వంశీని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వంశీ కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు నెల్లూరుకు చేరుకొని మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలకు తరలించారు. ఉమేష్‌చంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిచందన తెలిపారు.

ప్రయాణం..నరకప్రాయం





గతుకుల రోడ్డులో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కరకంబాడీ రోడ్డు నుంచి న్యూమంగళం, మిట్టగాంధీపురం వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నీరు నిల్వ ఉంటోంది. రాత్రి వేళలో ద్విచక్ర వాహనచోదకులు అదుపుతప్పి బోల్తాపడిపోతున్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు అంచనా వేయలేక రోడ్డు అంచుల్లో రాకపోకలు సాగిస్తూ అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాత్కాలిక పనులతో సరిపెట్టకుండా శాశ్వతంగా రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెప్పిన మాట వింటారా లేదా?

● ఇద్దరు యువతులకు పోకిరీల వేధింపులు

● పోలీసుల రాకతో పరార్

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెప్పిన మాట వింటారా లేదా.. అంటూ గురువారం రాత్రి 11 గంటల సమయంలో తిరుపతి నగరం లీలామహల్ సర్కిల్ సమీపంలో నలుగురు పోకిరీలు ఇద్దరు యువతులకు వేధింపులకు గురిచేశారు. కర్రతో కొట్టారు. దీనికి సంబంధించి.. ఇద్దరు యువతుల ముందు ఆ నలుగురు పోకిరీలు మద్యం తాగుతూ చెప్పిన మాట వింటారా లేదా చంపుడే అంటూ గదమాయిస్తున్నారు. మరో వ్యక్తి కర్రతో వారిని కొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరు యువతులు గట్టిగా కేకలు వేస్తూ మీరు చెప్పిన చోటికి రాలేమని చంపేసినా ఫర్వాలేదని ఎదురు తిరిగారు. దీంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న నలుగురు పోకిరీలు వారిని తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, రక్షక్ పోలీసులు వచ్చారు. వారిని చూసి ఆ పోకిరీలు పరారయ్యారు.

మందుబాబుల వీరంగం

● ఇద్దరు మహిళలపై దాడి

● మద్యం సీసాలతో కొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో యువకులు వీరంగం చేశారు. ఈ ఘటనలో దాదాపు ముగ్గురు మందుబాబులకు తలపై, కాళ్ళు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఎర్రమిట్టకు చెందిన చందు, హరి, శివ స్నేహితులు. వీరు తరచూ ఎర్రమిట్టలోని వార్డు సచివాలయం, నడి వీధుల్లో కూర్చుని మద్యం తాగుతూ.. దారిలో వెళ్లేవారితో అనుచితంగా ప్రవర్తించేవారు. కొందరు మహిళలను వేధించేవారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి వీరితో పాటు మరో ఐదుగురు లీలామహల్ జంక్షన్ వద్ద బారులో మద్యం తాగారు. చేతిలో వున్న బీరు సీసాలతో రెండు వర్గాలుగా దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం రోడ్డుపై వెళుతున్న ఇద్దరు మహిళలతో చందు, హరి, శివ అసభ్యకరంగా ప్రవర్తించారు. స్థానికులు వీరిని చితకబాదారు. అక్కడకు వచ్చిన పోలీసులకు వీరిని అప్పగించారు. ఈ ఘటనతో మంగళం రోడ్డులో దాదాపు గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. వివిధ సెక్షన్ల కింద అలిపిరి ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేశారు. మళ్లీ ఇలాంటి అరాచకాలకు పాల్పడకుండా రూ.5 లక్షల బాండుపై మేజిస్ట్రేట్ సమక్షంలో బైండోవర్ చేశారు. మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు ప్రకటనలో హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటారన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండులోని హోటళ్లు, క్యాంటీన్లలో శుక్రవారం ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) విభాగం అధికారులు జగదీష్, మద్దిలేటి తనిఖీలు నిర్వహించారు. ప్రజలు, శ్రీవారి భక్తులకు పరిశుభ్ర వాతావరణంలో సరైన ఆహారం అందించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంపై జాగ్రత్త చూపుతూ, నిబంధనల ప్రకారం వ్యాపారం నిర్వహించుకోవాలన్నారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేతమ్స్ షుగర్స్ చైర్మన్ అరెస్టు

నిండ్ర/నగరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిండ్ర మండల పరిధిలోని నేతమ్స్ చక్కెర కర్మాగార చైర్మన్ నందకుమార్‌ను నగరి పోలీసులు శుక్రవారం తిరుపతిలో అరెస్టు చేశారు. డీఎస్పీ అజీజ్, నగరి రూరల్ సీఐ భాస్కర్ కథనం మేరకు..... రైతులకు, కర్మాగార కార్మికులకు బకాయిలు చెల్లించకుండా నేతమ్స్ చక్కెర కర్మాగారాన్ని మూసివేయడంతో వారు కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు కేన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కేన్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా షుగర్ మిల్స్ అసోసియేషన్ సమావేశానికి నందకుమార్ హాజరైనట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం రాత్రి నందకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి వద్ద హాజరుపరచగా రిమాండుకు ఆదేశించారు.

మహిళా శక్తే.. దేశ శక్తి



సుధారెడ్డిని సన్మానిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలను శక్తివంతం చేయడం ద్వారా దేశాన్ని శక్తివంతంగా మార్చుకున్నట్టు అవుతుందని పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. బ్రిడ్జింగ్ ద ఫండింగ్ గ్యాప్ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో శుక్రవారం చేపట్టిన వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. 2047 దేశాభివృద్ధి లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. సీడీబీ ఏజీఎం రామేశ్వరరావు మాట్లాడుతూ వివిధ పథకాలు, వ్యాపార ప్రతిపాదనలు, రుణాల మంజూరు విధానాన్ని వివరించారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు పులివర్తి సుధారెడ్డిని సత్కరించారు.

మా స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న నీలమ్మ

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): తమ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని పుత్తూరుకు చెందిన నీలమ్మ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ పుత్తూరులోని కేఎస్‌రోడ్డులో గల ఇంటిని దానా సెటిల్‌మెంట్ ద్వారా తన తండ్రి ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను ఆ ఇంట్లో ఉంటున్నానని చెప్పారు. అయితే గతనెల 20న తన తండ్రి, సోదరుడు, అతని భార్య, బావమరిది, మరికొందరు వచ్చి ఇంటిని ఖాళీ చేయాలని కోరారని, దౌర్జన్యంగా సామాన్లు బయట వేశారని అన్నారు. పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఆమె వెంట వరలక్ష్మి, సుబ్బమ్మ, గుర్రమ్మ, సుభద్రమ్మ, మునెమ్మ, నాగులు, జయశంకర్, గుర్రప్ప ఉన్నారు.

న్యూ మంగళంలో భూ వివాదం


వీఆర్వోతో వాదిస్తున్న గ్రామస్తులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): న్యూమంగళంలో శుక్రవారం భూ వివాదం చోటు చేసుకుంది. మంగళం లెక్కదాఖల సర్వేనంబర్ 52/2లో దాదాపు 3.86ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గిరిజన సంక్షేమ జిల్లా విభాగం ఆ స్థలంలో పాఠశాల నిర్మాణం కోసం పనులు ప్రారంభించింది. గమనించిన న్యూమంగళం గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమి అంటూ ప్రతిఘటించారు. వీఆర్వో సతీష్ అక్కడికి చేరుకుని ఇరువురిని విచారించారు. మీ వద్దవున్న ఆధారాలు తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి రావాలని గ్రామస్తులకు తెలపగా వాగ్వాదానికి దిగారు. ట్రైబల్ వెల్ఫేర్ విభాగం అధికారులను కూడా తహసీల్దార్‌ను కలవాలని సూచించారు. ఆ మేరకు ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు తహసీల్దార్ సురేష్‌బాబును కలిసి తమ వద్ద ఉన్న ఆధారాలు చూపారు. 2019లోనే స్థలం వారికి కేటాయించినట్లు గుర్తించారు. తహసీల్దార్ మీడియాతో మాట్లాడుతూ ఆ స్థలం పూర్తిగా ట్రైబల్ వెల్ఫేర్ విభాగానికి కేటాయించినట్లు రికార్డులు తెలుపుతున్నాయన్నారు.

జేశాప్‌కు నూతన కమిటీ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జేశాప్(జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా విజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నారా హరిబాబు, కోశాధికారిగా నరేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, దుగ్గాని ప్రసాద్, నెల్లూరు శ్రీనివాసులు, ఉప కార్యదర్శులుగా కామేశ్వరయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, శీనయ్యలను ఎన్నికయ్యారు.

టెండర్లకు ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ బీటెక్ చివరి సంవత్సర విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఏపీ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరుతున్నారు. సమగ్ర సమాచారం కోసం ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్ చూడవచ్చు. ఈ మేరకు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

22న స్విమ్మింగ్ జట్ల ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో ఈనెల 22న అండర్ 14, 17, 19 బాలబాలికల స్విమ్మింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు అర్హులని, సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని కోరారు. హెచ్‌ఎం నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కుల జాబితా తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 8121777077ను సంప్రదించాలని కోరారు.

ఆయుర్వేదంపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆయుర్వేదంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యంపై అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయుర్వేద రిటైర్డు ప్రొఫెసర్ కృష్ణయ్య నేతృత్వంలో విద్యార్థులు, ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేశారు. ఉచితంగా మందులు అందజేశారు.

మిషన్ ఆఫ్ వికసిత్ భారత్‌ను సద్వినియోగం చేసుకోండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాఘవన్ తదితరులు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మిషన్ ఆఫ్ వికసిత్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి రీజనల్ సెంటర్ డైరెక్టర్ రాఘవన్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి లోని ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ ప్రాంతీయ కేంద్రం, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం సంయుక్తంగా సంస్కృత విశ్వ విద్యాలయంలో ఈనెల 22న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెయింటింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజన్ ఆఫ్ వికసిత్ భారత్ అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు బహుమతులు ఉంటాయని, మరిన్ని వివరాలకు 9866874963, 6303601422లను సంప్రదించాలని కోరారు.

తిరుపతి పరిణామాలపై సీఎంకు నివేదన



తిరుపతి, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో కొంతకాలంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలు, వర్గ విభేదాలపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబుకు వివరించారు. శుక్రవారం విజయవాడకు వెళ్లి సీఎంను కలిశారు. తిరుపతి నియోజకవర్గంపై ఫోకస్ పెట్టాలని కోరినట్టు తెలిసింది. అదేవిధంగా కాపుభవన్ నిర్మాణానికి సహకరించాలని, టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయాలని సుగుణమ్మ వినతిపత్రం అందించారు. ఆమె వెంట యువ నాయకురాలు భట్టే వెంకట కీర్తి ఉన్నారు.

వానావానా.. వెల్లువాయే..

- నగరంలో కుండపోత వర్షం
- నదులను తలపించిన వీధులు




వర్షంలో తడుస్తూ ద్విచక్రవాహనదారుల అవస్థలు, మోకాటి లోతు నీటిలో కారు ప్రయాణం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపరితల ద్రోణి ప్రభావంతో నగరంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఉరుములు, మెరుపులతో మొదలైన వాన దాదాపు మూడు గంటల వరకు దంచికొట్టింది. నీటి ప్రవాహానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వీధులన్నీ నీటి ప్రవాహంతో నదులను తలపించాయి. రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఇందిరా ప్రియదర్శిని మార్కెట్, సెంట్రల్ బస్టాండు జలమయమయ్యాయి. రేణిగుంట, తిరుచానూరు, తిరుమల బైపాస్, కరకంబాడీ ప్రధాన రహదారులతోపాటు తిమ్మినాయుడుపాళెం, గొల్లవానిగుంట మాస్టర్‌ప్లాన్ రోడ్లపై వర్షపునీరు చేరాయి. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. జనసంచారం స్తంభించింది. కొన్నిచోట్ల డ్రైనేజీలు, సైడు కాలువలు పొంగిపొర్లాయి. దీంతో వ్యర్థాలు రోడ్లపైకి చేరాయి. మాలాడిగుండం, కపిలతీర్థం జలపాతాలు ఉధృతంగా ప్రవహించాయి. మంగళంలోని లోతట్టు ప్రాంతాలకు నీరు చేరాయి. పొలాల్లోనూ నీరు చేరి తటాకాన్ని తలపించాయి. సాయంత్రానికి వర్షం తగ్గడంతో బడి పిల్లలు, ఉద్యోగులు, కూలీలకు ఇబ్బంది లేకుండా పోయింది. వాతావరణం చల్లబడింది. శేషాచలకొండ అంచుల్లో మేఘాలు ముద్దాడుతూ ప్రకృతి ప్రేమికులను పరవశింపజేశాయి.




ఓ వీధిలో చేరిన వర్షపునీరు, వాన నీటిలో ద్విచక్ర వాహనదారుల తిప్పలు, వానలో వీధివ్యాపారుల జీవనపోరాటం

మీసేవా ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి


ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ తన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వం తొలగించిన 607 మంది ఈ సేవా ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి, ఏపీ మీసేవ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం అభ్యర్థన దీక్షలు నిర్వహించారు. మురళి మాట్లాడు తూ మీసేవా ఉద్యోగులను విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాస్, భువనేశ్వరి, సునీత, రామకృష్ణ, రమేష్, శ్రీధర్, రవీంద్ర, లోకేష్, శ్రీనివాస్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా శాస్త్రవేత్త అవార్డు


అవార్డు అందుకుంటున్న చండీకుమారి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ మైక్రోబయాలజీ అధ్యాపకురాలు చండీకుమారి మహిళా శాస్త్రవేత్త అవార్డు పొందారు. కాశ్మీర్‌లో నిర్వహించిన ఓ సదస్సులో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. పరిశోధనా రంగంలో విశేష కృషికి గుర్తింపుగా అవార్డు అందజేశారు. పలువురు ఆమెను అభినందించారు.

సీబీఎస్‌ఈ స్కూళ్ల ప్రిన్సిపాళ్ల ఎక్స్‌పోజర్ విజిట్


సదస్సులో పాల్గొన్న సీబీఎస్‌ఈ ప్రిన్సిపాళ్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సీబీఎస్‌ఈ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు రెండు రోజుల ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా పద్మావతి మహిళా యూనివర్సిటీకి వచ్చా రు. మొదటి రోజు శుక్రవారం ప్రారంభ సమా వేశం నిర్వహించారు. డీన్లు వాణి, సుధ పాల్గొని మాట్లాడారు. మహిళలకు నైపుణ్యాలు, నైతిక విలువలు అందించే లక్ష్యంతో పద్మావతి యూని వర్సిటీ ఏర్పాటైందని తెలిపారు. యూనివర్సిటీ లోని వివిధ కీలక విభాగాలు, నిర్వహణ తీరు, లక్ష్యాలను వివరించారు. ప్రపంచ స్థాయిలో రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎన్‌ఈపీ-2020 అమలు జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆముదవల్లి, 43 మంది సీబీఎస్‌ఈ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నేడు హిందీ జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హిందీ దినోత్సవం సందర్భంగా ఎస్వీయూ హిందీ విభాగంలో శనివారం ఒక్క రోజు హిందీ జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. హిందీ భాష - వర్తమాన మార్పులు - అవకాశాలు అంశంపై ఈ కార్యక్రమం జరగనుంది. ఉదయం 10 గంటలకు ఎకనమిక్స్ గ్యాలరీలో సదస్సు ప్రారంభం కానుంది. తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నారాయణరాజు, ప్రిన్సిపాల్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి, అన్నామలై యూనివర్సిటీ ప్రొఫెసర్ జగన్నాథరెడ్డి పాల్గొంటారని హిందీ హెడ్ నారాయణ, సెమినార్ డైరెక్టర్ రాంప్రకాష్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం


నిరసన దీక్షలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని జేఏసీ తిరుపతి సర్కిల్ నాయకులు దేవేంద్రరెడ్డి, టి.జయరామ్, మురళీధర్, ఎల్.చలపతి, నాగరాజు, వి.గోపి హెచ్చరించారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన దీక్షలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూకూటమి ప్రభు త్వం వెంటనే స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు వెలగటూరు ఐ.సుబ్రమణ్యం, జనార్దన్, శశి, కార్తీక్. సి.వి.వేణు, పుత్తూరు, తిరుపతి టౌన్, రూరల్, డివిజన్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

8వ వేతన కమిషన్ కమిటీ ఏర్పాటు చేయండి


సీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8వ వేతన కమిషన్ కమిటీని వెంటనే నియమించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తిరుపతి రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని కోచింగ్ డిపో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. యూనియన్ నాయకులు ఈశ్వరయ్య, రవీంద్ర నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మరో మూడు నెలల్లో 8వ వేతన సవరణ వేతనాలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు కమిటీని నియమించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే కమిటీని ఏర్పాటు చేసి 2026 జనవరికి 8వ వేతన సవరణ జీతాలు చెల్లించాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణస్వామి, గౌస్‌బాషా, మారయ్య, శేఖర్‌రెడ్డి, రోహిణి, అమిత్ పాస్వాన్, శ్రీనివాసులు, వెంకటేష్, జగదీష్ పాల్గొన్నారు.



అనుమతులు లేని నిర్మాణం తొలగింపు



తిరుపతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలోని పూలవాని గుంటలో అనధికారికంగా నిర్మిస్తున్న మూడవ అంతస్తును తొలగించామని డిప్యూటీ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ ఖాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని పూలవానిగుంట వద్ద అనుమతులు లేకుండా మూడవ అంతస్తు నిర్మిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం ఆ అంతస్తును పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారని తెలిపారు. నగరంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సప్లై చానల్స్‌లో పూడికతీత



తిరుపతిరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ ఎదురుగా ఉన్న మఠంభూమిలో నిల్వచేరిన వర్షపు నీరు సప్లైచానల్స్ ద్వారా సాఫీగా సాగేందుకు శుక్రవారం సాయంత్రం పూడికతీత పనులు చేపట్టారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మఠం భూముల్లో నీరు నిల్వ చేరడంతో ఇబ్బందికరంగా మారింది. దీంతో ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువలు, తూముల వద్ద పూడికతీత పనులు చేపట్టి నీరు ముందుకు కదిలే ఏర్పాట్లు చేశారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పార్లపల్లి భరత్ కుమార్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ బిరుదాల సిద్దారెడ్డి, రాధారాయల్, గురవారెడ్డి, తులసీరామిరెడ్డి, రోహిత్, మణి పాల్గొన్నారు.



టీటీడీకి విరాళంగా ఫాస్ట్‌ఫుడ్ వాహనం

తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): టీటీడీకి శుక్రవారం ఓ ఫాస్ట్‌ఫుడ్ వాహనం విరాళంగా అందింది. బెంగుళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య విద్యాసంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్ రామ్ రూ.14 లక్షల విలువైన వాహనాన్ని అందించారు. దీంతోపాటు టీటీడీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను, విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.



తిరుమలలో నటి ప్రేమ


తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి ప్రేమ, ఎమ్మెల్యే గుడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు లడ్డూ ప్రసాదాలు అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తుతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.70 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,095
తలనీలాలు సమర్పించినవారు: 23,932



ఆరోగ్యవరప్రసాదినికి రూ.10 లక్షలు



తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య పొలెపల్లి అనే భక్తుడు టీటీడీ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

శ్రీసిటీని సందర్శించిన హెచ్‌సీసీ బృందం



ప్రసంగిస్తున్న నిరీషా సన్నారెడ్డి

సత్యవేడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై హిందుస్థాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (హెచ్‌సీసీ)కు చెందిన 25 మంది ప్రతినిధుల బృందం (సీఐఐ) శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. ఇక్కడ వ్యాపార అనుకూల అవకాశాలు, పారిశ్రామిక సామర్థ్యాన్ని పరిశీలించింది. సంస్థ ఛైర్మన్ గోపినాథ్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తాతియా నేతృత్వంలో విచ్చేసిన హెచ్‌సీసీ బృందానికి శ్రీసిటీ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషారెడ్డి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు, వ్యూహాత్మక ప్రయోజనాలు, ఇతర ప్రత్యేకతలను శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ వివరించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ అధికారులతో చర్చల్లో పాల్గొన్న హెచ్‌సీసీ ప్రతినిధులు, వివిధ అంశాలపై నిశితంగా ఆరాతీసి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం డైకిన్, వరుణ్ బేవరేజెస్, ఎంఎస్ఆర్ గార్మెంట్స్ పరిశ్రమలను సందర్శించారు. కంపెనీల సాంకేతిక నైపుణ్యాలు, తయారీ విధానాలను పరిశీలించారు. సందర్శనకు సహకరించిన శ్రీసిటీ యాజమాన్యానికి గోపినాథ్, ప్రవీణ్ తాతియా కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ప్రణాళిక, పెట్టుబడి అనుకూల వాతావరణాన్ని కొనియాడారు. పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐఐటీలో నేడు రేపు కళా ఉత్సవం

ఏర్పేడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి ఐఐటీలో ఈనెల 20, 21 తేదీల్లో తిరుపతికి చెందిన ఆర్టిస్టా క్లబ్ ఆధ్వర్యంలో కళాంగిని పేరుతో ప్రత్యేక కళా ఉత్సవం జరగనుంది. ఈ వేడుకల్లో తిరుపతికి చెందిన మహిళా కళాకారిణులు స్టీల్ ఆర్ట్, నిర్మల్ ఆర్ట్ వంటి సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించనున్నారు. శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్న ఈ కళా ఉత్సవం ఆదివారం సాయంత్రం 5గంటలకు ముగుస్తుంది. శనివారం కళాఉత్సవం, వర్క్‌షాపులు, సీనరి పెయింటింగ్, ఫ్లోరల్ ఆర్ట్, పేపర్ డెకర్, పాట్ ఆడోర్నమెంట్ వంటివి నిర్వహించనున్నారు. అలాగే పెయింటింగ్‌పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. 21న ఆదివారం ఆర్ట్ ఎగ్జిబిషన్ జరగనుంది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ దివాకర్ రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. సంప్రదాయ కళాఖండాలు, వర్క్‌షాపులతో ప్రత్యేక ప్రదర్శనలు చేపట్టనున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు మూడేళ్ల జైలు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడి ఏడుగురు స్మగ్లర్లకు ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు, తలా రూ.20 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. మండలంలోని కారణిమిట్టకు చెందిన సమ్మిటి పెద్దగురవయ్య, కారణి రామయ్య, పిగిలి మోహన్, పిగిలి వెంకటయ్య, చెరివి శ్రీనాథ్, చెరివి రమణయ్య, వెంకటగిరి మునిరత్నంలను ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో 2016లో అప్పటి ఎస్ఐ హేమంత్‌కుమార్‌రెడ్డి అరెస్టు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారయణ సాక్ష్యధారాలను నిరూపించి నిందితులకు శిక్ష పడేలా చేశారు. శేషాచలం అడువుల్లో విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడివిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్థులకు ఇది హెచ్చరిక అని తిరుపతి ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఈ సందర్భంగా హెచ్చరించారు. నిందితులకు శిక్షపడేలా సహకరించిన శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, బీఎన్‌కండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడులను ఎస్పీ అభినందించారు.

రూ.13లక్షలు స్వాహా చేశారు

● ముగ్గురిపై సురేష్ ప్రొడక్షన్స్ మేనేజరు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సురేష్ ప్రొడక్షన్స్‌కు సంబంధించిన రూ.13 లక్షల నగదును స్వాహా చేసినట్లు ఆ సంస్థ మేనేజర్ నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని రెండు సినిమా హాళ్లను సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ లీజుకు తీసుకొని నడుపుతోంది. ఆ సినిమా హాళ్ల నుంచి వచ్చిన నగదును సురేష్ ప్రొడక్షన్స్ ఉద్యోగి సాయి బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తూ ఉంటాడు. మూడు నెలలుగా తక్కువ నగదు డిపాజిట్ చేసి బ్యాంక్ ఇచ్చిన రశీదును మార్చి యాజమాన్యానికి పంపేవాడు. ఇటీవల సురేష్ ప్రొడక్షన్స్ ప్రధాన కార్యాలయం సిబ్బంది పరిశీలించగా సాయి రూ.10 లక్షలు స్వాహా చేసినట్లు, అక్కడే పనిచేస్తున్న బాషా, మాకాని సాయి కలిసి రూ.3 లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎం ప్రారంభించనున్న పీఏసీ5 భవనాన్ని పరిశీలించిన ఈవో

తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతనంగా నిర్మించి ప్రారంబానికి సిద్ధంగా ఉన్న పీఏసీ-5(వేంకటాద్రి నిలయం)ను టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం పరిశీలించారు. 25న సీఎం చంద్రబాబు ఈ భవనాన్ని ప్రారంభిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రాన్ని అధికారులు పరిశీలించారు. ఈవోతో పాటు సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, సీఈ సత్యనారాయణ ఉన్నారు.



మత్స్యకారుల్లో 'అల'జడి

● బతుకు నావకు కొరవడిన భద్రత
● ప్రమాద అంచున జెట్టి నిర్మాణం
● బోట్లు కొట్టుకుపోతాయని ఆందోళన





కోట మండలం గోవిందపల్లిపాళెం తీరం వద్ద జెట్టి ప్రమాదకరంగా ఉండటంతో ఒడ్డున నిలిపివేసి ఉన్న ఇంజన్ బోట్‌లు (ఫైబర్ బోట్) - గోవిందపల్లిపాళెం వద్ద స్వర్ణముఖి, చల్లకాలువ, బకింగ్‌హమ్ కెనాల్ కలిసేచోట నిర్మించి ఉన్న జెట్టి కోతకు గురై నీళ్లల్లో తేలుతున్న దృశ్యం

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ జీవనోపాధికి ఊతంగా నిలిచిన జెట్టి ప్రమాదపు అంచుకు చేరడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఏడెనిమిదేళ్లపాటు తమ బోట్ల భద్రతకు భరోసా ఇచ్చిన ఈ నిర్మాణం సాగరంలోకి కొట్టుకుపోతుందేనని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కోట మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధిలో గోవిందపల్లిపాళెం, శ్రీనివాస సత్రం గ్రామాలున్నాయి. గోవిందపల్లిపాళెం తీరం నుంచి నిత్యం 200కు పైగా ఇంజన్‌బోట్లతో ఈగ్రామాల మత్స్యకారులు వేటకు వెళ్తుంటారు. అయితే వేట తర్వాత తీరం చేరిన పడవలకు రక్షణ కొరవడేది. మత్స్యకార గ్రామాల ఎగువభాగం నుంచి స్వర్ణముఖి, చల్లకాలువ నదులతోపాటు బకింగ్‌హామ్ కెనాల్ ఉధృతంగా ప్రవహిస్తూ గోవిందపల్లిపాళెం వద్ద బోట్లు, వలలతోపాటు వేట సామగ్రిని ముంచెత్తేది. ఆటుపోట్లు, అలజడులు, ప్రకృతి విపత్తులకు ఇంజన్‌బోట్లు సముద్రంలోకి కొట్టుకుపోయేవి. దీంతో తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులు తిరిగి కొనుక్కునే స్థోమతలేక వేటకు వెళ్లలేక వీధినపడేవారు.

పాశం చొరవతో జెట్టి నిర్మాణం

మత్స్యకారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని 2016లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ చొరవ తీసుకున్నారు. ఆర్‌డీఎఫ్ కింద రూ.కోటి మంజూరు చేయించారు. ఈ నిధులతో ఇంజన్ బోట్ల రక్షణ కోసం గోవిందపల్లిపాళెం తీరంలో జెట్టిని నిర్మించారు. ఉధృత ప్రవాహాల నుంచి బోట్లు, వలలతోపాటు వేట సామగ్రి కొట్టుకు పోకుండా జెట్టి అడ్డుగోడగా నిలిచింది. ఫలితంగా మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గతేడాది వరద ఉధృతి జెట్టిని కూడా ముంచెత్తింది. దీంతో జెట్టి పూర్తిగా కోతకు గురైంది. నీటిమీద తేలియాడే పరిస్థితికి వచ్చింది. రక్షణ గోడలు, రింగ్‌బండ్‌లు లేకపోవడంతో చుట్టూ ఉప్పునీరు చేరి ఇది కూలిపోయే స్థితికి చేరింది.

అభద్రత తీరాన బోట్లు

ప్రమాదంలో పడిన జెట్టిపై నమ్మకంలేక మత్స్యకారులు విధిలేని పరిస్థితుల్లో తమ బతుకు ఆధారమైన బోట్లను తీరంవద్ద నిలిపేసి వెళ్తున్నారు. దేవుడి మీద భారం వేస్తున్నారు. ఏ క్షణంలోనైనా సాగరంలో తీవ్ర అలజడులు వచ్చినా, వరదనీరు ప్రవహించినా జెట్టి కొట్టుకుపోయేలా ఉందని వీరంతా ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జెట్టికి మరమ్మతులు చేపట్టి తమ బోట్లకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

8 కిలోమీటర్లలోపే చేపల వేట



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సముద్రతీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోపు వరకే చేపల వేట సాగించాలని మత్స్యకారులకు తహసీల్దారు జయజయరావు, మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి సూచించారు. కోట మండలం గోవిందపల్లిపాళెం సముద్రతీరం వద్ద శుక్రవారం మత్స్యకారుల భద్రతపై మెరైన్, మత్స్యశాఖల ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో వీరు మాట్లాడారు. సముద్రంలోకి ఇతర ప్రాంతాల బోట్లు, అపరిచిత వ్యక్తుల సంచారం ఉంటే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. జెట్టి నిర్మాణ పనులకు రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. తుపాను షెల్టర్ల తాత్కాలిక మరమ్మతులకూ నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అనంతరం గోవిందపల్లిపాళెం సముద్ర తీరంలో మత్స్యకారులతో కలసి అధికారులు విహరించారు. మెరైన్ ఎస్ఐలు నారాయణ రెడ్డి, శివసౌమ్య, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌డీవో రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా ఆపండి

● ట్రాక్టర్ కింద పడుకొని అడ్డుకున్న గ్రామస్తుడు



ట్రాక్టర్ కింద పడుకొన్న బాపూజీ

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. వీటి జోరుకు ఇళ్లల్లోని పిల్లలు భయాందోళన చెందుతున్నారు' అంటూ చంద్రగిరి మండలం ఎగువ రెడ్డివారిపల్లెలో బాపూజీ అలియాస్ బాబ్జీ అడ్డుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఇసుక ట్రాక్టరు కింద పడుకున్నారు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో స్వర్ణముఖినది నుంచి ఇసుకతో ఆయన ఇంటి ముందు ట్రాక్టరు వెళ్తుండగా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్‌కి, బాపూజీకి కొంత వాగ్వాదం చోటుచేసుకొంది. శుక్రవారం ఉదయం కూడా యథావిధిగా ఇసుక ట్రాక్టర్లు తన ఇంటి ముందు పోతుండగా మళ్లీ బాపూజీ అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ దురుసుగా మాట్లాడారు. ఇసుక రవాణాకు ఎవరు అనుమతులు ఇచ్చారో చెప్పాలంటూ బాపూజీ డిమాండ్ చేశారు. తన ఇంటి ముందు ఇసుక ట్రాక్టర్ వెళ్లకూడదంటూ టైరు ముందు భాగంలో పడుకొన్నారు. ఎలా ట్రాక్టర్ నడుపుతావంటూ అడ్డుకున్నారు. అనంతరం డయల్ 100కి కాల్ చేయగా పోలీసులు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై బాపూజీ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారిస్తున్నారు.

మహిళల కోసమే వైద్యశిబిరాలు



చంద్రగిరి సీహెచ్‌సీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారి సశక్త్ అభియాన్ (ఆరోగ్య వంతమైన మహిళ- శక్తిమంతమైన కుటుంబం) పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసమే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయి. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబాన్ని బలపరిచే లక్ష్యంతో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం ప్రారంభమైన ఈ వైద్య శిబిరాలను అక్టోబరు 2వ తేది వరకు రెండు వారాల పాటు నిర్వహించనున్నారు. ఈవైద్య శిబిరాలకు మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ శిబిరాల్లో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వారికి సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేసేలా చర్యలు చేపట్టారు. 'మహిళ ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుంది. తల్లి ఆరోగ్యంగా ఉంటే పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు. మహిళా శక్తి సమాజ శక్తికి పునాది అవుతుంది' అనే నినాదంతో మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలలో వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నారు.

శిబిరాల్లో అందించే వైద్య సేవలివీ

మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌కు పరీక్షల ద్వారా తగిన వైద్య చికిత్సలను, రెఫరల్ సేవలను అందిస్తున్నారు. మహిళలు, కిశోర బాలికలలో రక్తహీనతను గుర్తించడం, గర్భవతులను పరీక్షించి సరైన పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గర్భిణులకు ఎమ్‌సిపి కార్డులు అందజేస్తున్నారు. పిల్లలలో సికిల్ సెల్ అనీమియా గుర్తించి అవసరమైన వారికి చికిత్స చేస్తున్నారు. పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తారు. యుక్త వయస్సు బాలికలు, మహిళలకు బహిష్టు పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు అందిస్తున్నారు. ఈ శిబిరాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ సూచించారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులకూ నమోదు చేసుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

పాకాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై శుక్రవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ సుదర్శన ప్రసాద్ తెలిపారు. పాకాల మండలానికి చెందిన ఆటో డ్రైవర్ శివ అలియాస్ ఆలీ (35) తొమ్మిదేళ్ల బాలికను గురువారం సాయంత్రం మాయమాటలతో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అసభ్యంగా ప్రవర్తించి బలాత్కారం చేయబోయాడు. బాలిక కేకలు వేయడంతో వదిలేశాడు. బాలిక ఇంట్లో చెప్పడంతో ఆటోడ్రైవరును గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుదర్శన ప్రసాద్ శుక్రవారం ఆటో డ్రైవర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

పాలెంపాడులో డీఎంహెచ్‌వో



దొరవారిసత్రం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పాలెంపాడు గ్రామాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ శుక్రవారం సందర్శించారు. ఇప్పటికే ఆ గ్రామంలో పలువురు కిడ్నీ సమస్యలతో మృతి చెందగా, దాదాపు 25 మంది కిడ్నీ సంబంధిత రోగాలతో బాధ పడుతున్నారు. ఇటీవల స్థానిక డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలోని వైద్య బృందం గ్రామస్తులకు రక్త పరీక్షలు చేయడంతో పాటు, నీటి నమూనాలను సేకరించి జిల్లా పరీక్షా కేంద్రానికి పంపారు. నీటి నాణ్యతలో లోపం లేదని తేలడంతో కిడ్నీ సమస్యలకు కారణాలను కనుగొనేందుకు అన్వేషణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో పాలెంపాడులో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రత్యేక వైద్య బృందాన్ని పంపి ఎందువల్ల కిడ్నీ సమస్యలు వస్తున్నాయో తేలుస్తామని చెప్పారు. స్థానిక వైద్యులు చైతన్య, లావణ్య ఉన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో 22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు



చెంగాళమ్మ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు శరన్నవ రాత్రి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. 11 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే రోజుకొక ప్రాంతం నుంచి సారె సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవదాయశాఖ అధికారులు చేస్తున్నారు. ఉత్సవాల్లో అమ్మవారు 22వ తేదీన పరమేశ్వరి అలంకారం, 23న గాయిత్రి, 24న అన్నపూర్ణ, 25న అష్టకాళి, 26న మహాలక్ష్మి, 27న బాలత్రిపుర సుందరి, 28న చండి, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, 1న రాజరాజేశ్వరి, 2న మహిషాసురమర్థిని అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో మహా చండీయాగం నిర్వహిస్తామని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

నానో ఎరువుల వాడకంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో కోరమాండల్ పరిశ్రమ వారు నానో ఎరువుల ప్రాముఖ్యత, వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రసాదరావు మాట్లాడుతూ యూరియా కొరతను అధిగమించడానికి వినియోగం తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాక వాటి వాడకంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందన్నారు. కోరమాండల్ ప్రైవేటు లిమిటెడ్ బిజినెస్ మేనేజరు స్వరూప్ దశలవారీగా నానో ఎరువుల వాడకం, నేల ఆరోగ్యం, పర్యావరణం గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ధనంజయరెడ్డి, జోనల్ మేనేజరు రమణారెడ్డి, సీనియర్ అగ్రానమిస్టు నర్సిరెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో కోచ్ గోపీనాయుడికి అవార్డు



గోపినాయుడికి అవార్డు, ట్రోఫీ అందజేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రిత్వ శాఖ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ సంస్థ తిరుపతికి చెందిన తైక్వాండో కోచ్ మాస్టర్ గోపినాయుడికి ప్రతిష్టాత్మక సుభాష్‌చంద్ర బోస్ ఐకాన్ 2025 అవార్డు ప్రదానం చేసింది. టీటీడీ విద్యాసంస్థలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందించింది. శుక్రవారం సాయంత్రం ఆయన టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన చేతుల మీదుగా అవార్డు, జ్ఞాపికను అందుకున్నారు.

30 కిలోల గంజాయి స్వాధీనం : నలుగురి అరెస్టు



గంజాయి సీజ్ చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... ఒడిశా రాష్ట్రం రానాలి గ్రామానికి చెందిన డోన్ చాందిని, దానుపాణి, జోసెఫ్ బర్డాన్ తిరుపతిని కేంద్రంగా చేసుకుని గంజాయి వ్యాపారం సాగిస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి తమిళనాడులోని స్మగ్లర్లకు విక్రయిస్తున్నారు. శుక్రవారం అందిన రహస్య సమాచారం మేరకు రామతులసి కల్యాణ మండపం వద్ద తమిళనాడు తిరునల్వేలి జిల్లా కొక్కిరాకులం గ్రామానికి చెందిన ఎం.ముత్తువేలు గంజాయి తీసుకెళుతుండగా ఈస్ట్ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో కలసి పట్టుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు ఒడిశాకు చెందిన డోన్ చాందిని, దానుపాణి, జోసెఫ్ బర్డాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

పుత్తూరు వార్తలు

ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

వడమాలపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు పూర్ణాహుతితో శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి ఏకాంతంగా పద్మావతి, ఆండాల్ అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. తోమాల సేవ, అర్చన చేపట్టారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరుడి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. మాడవీధుల్లో ఉభయ దేవేరులతో శ్రీవారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ పూర్ణాహుతి, కుంభ బింబం, స్వామివారి వేంచేపు, కళావాహన విశేష నివేదన, అర్చక బహుమానంతో పవిత్రోత్సవాలు వైభవంగా ముగిసాయి.

దస్తావేజు లేఖకుల పెన్‌డౌన్



పుత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖకుల నిరసన

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): పుత్తూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు స్తంభించాయి. రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖకులు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ శాఖలో ఓటీపీ, స్థానిక సంస్థల డేటా ఆధారంగా రిజిస్ట్రేషన్లు, సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాల కారణంగా దస్తావేజు తయారీ జటిలంగా మారుతోందన్నారు. సబ్‌రిజిస్ట్రార్ సెలవులో ఉండడంతో సీనియర్ అసిస్టెంట్ శ్వేతకు వినతిపత్రాన్ని అందజేశారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు లేఖకులు నిరసన చేపట్టినట్టు తెలుసుకుని వెనుదిరిగారు.

త్వరలో మార్కెట్ యార్డులో రైతు బజారు



సమావేశంలో మాట్లాడుతున్న గణేశ్

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు బజారు ఏర్పాటు చేయనున్నట్టు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు డి.ఎస్. గణేశ్ తెలిపారు. శుక్రవారం మార్కెట్ యార్డులో పాలకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు విస్తీర్ణం సర్వే, ప్రహరీ మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్లు, సిమెంటు రోడ్డు నిర్మాణాలపై చర్చించారు. అలాగే వారపు సంత నిర్వహణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి తులసీరాం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పరుగుపందెంలో క్రీడాకారులు

పుత్తూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి అథ్లెటిక్స్ వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించి జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీనియర్ బాల,బాలికలకు 21 విభాగాల్లో, జూనియర్ బాలబాలికలకు 17 విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రతి విభాగంలో ఇద్దరు క్రీడాకారులు వంతున జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పుత్తూరు డీవైఈవో ఉమామహేశ్వరరావు, ఎంఈవో తిరుమలరాజు, ప్రభాకర్‌రాజు, గోపీకృష్ణ, జయప్రకాష్, కేశవులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు





శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం తెలంగాణ స్మాల్ కేసెస్ కోర్టు చీఫ్ మినిస్టీరియల్ ఆఫీసర్ పీవీపీ అంజనీకుమారి, ప్రముఖ సినీ ప్రతినాయుడు కిల్లి క్రాంతి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, ఏఐటీయూసీ నాయకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

యువకుడిపై పోక్సో కేసు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ బాలికను గర్భవతిని చేసిన నాగరాజు అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు. కడప ప్రాంతానికి చెందిన నాగరాజు కొంతకాలంగా పట్టణంలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఉంటున్న బాలికను గర్భవతిని చేయడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

దాడి కేసులో రూ.500 జరిమానా

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో నిందితుడికి నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షిసుందరి రూ.500 జరిమానా విధించినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. 2018లోని గొట్టిప్రోలు గ్రామానికి చెందిన గోపాల్‌పై అదే గ్రామానికి వెంకటయ్య కర్రతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారించిన న్యాయమూర్తి వెంకటయ్యకు రూ.500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఈ దారిలో వెళ్లేదెలా?

- బురదమయంగా తాళ్వాయిపాడు అరుంధతికాలనీ రోడ్డు
- నడిచేందుకూ వీలుకాని దుస్థితి
- ఏళ్లుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పెళ్లకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల పరిధిలోని తాళ్వాయిపాడు అరుంధతి కాలనీ గ్రామానికి వెళ్లే దారి చినుకుపడితే బురదమయంగా మారడంతో నడుద్దామన్నా వీలుకాక గ్రామస్తులు నరక యాతన పడుతున్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి జాతీయ రహదారికి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న అరుంధతికాలనీ సరైన రహదారి సౌకర్యం లేదు. మట్టిరోడ్డు కావడంతో రెండురోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షానికి పూర్తిగా బురదమయంగా మారి కనీసం నడుద్దామన్నా వీలుకాని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు ప్రయాణించడం కూడా కష్టంగా మారింది. మండలంలో మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారులు బీటీ, సీసీ రోడ్లతో కళకళలాడుతుంటే జాతీయ రహదారికి కూతవేటు దూరంలోని తాళ్వాయిపాడు అరుంధతికాలనీకి సరైనదారి సౌకర్యం లేకపోవడం పట్ల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని రోడు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



చిత్తడిగా మారిన తాళ్వాయిపాడు అరుంధతి కాలనీ దారి

సూళ్లూరుపేటలో భారీ వర్షం: జలమయమైన రోడ్లు



బాలికల ఉన్నత పాఠశాల ఎదుట వర్షపునీటితో విద్యార్థుల ఇబ్బందులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు భగభగతో జనాలు అల్లాడిపోయారు. సాయంత్రం 4 గంటల సయయంలో కారు మబ్బులు కమ్ముకుని ఉరుములతో కూడిన భారీ వర్షం కురవడంతో పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ జలయమంగా మారాయి. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి జీఎన్‌టీ రోడ్డులో పోలీసుస్టేషన్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు మోకాటి లోతు వర్షపునీళ్లు నిలబడడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని సాయినరగ్, ఇసుకమిట్ట, హోలిక్రాస్ కూడలి ప్రాంతాల్లో మురుగు కాలువలు పొంగడంతో వర్షపునీరంతా రోడ్లపై నిలబడడంతో విద్యార్థులు, స్థానికులకు అవస్థలు తప్పలేదు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పక్కనే ఉన్న మురుగుకాలువ పొంగడంతో పాఠశాల ప్రాంగణంలోకి నీరువెళ్లడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా, కార్యాలయాల ముందు మోటాటి లోతు నిలబడింది. సూళ్లూరుపేట పట్టణంలో మురుగునీరు పారుదలకు ముగునీటి కాలువలు సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షమొచ్చిన ఇండ్ల మధ్యలో రోడ్లపైకి నీరుచేరుతోంది.

గూడూరులో మోస్తారు వర్షం

గూడూరు: పట్టణంలో శుక్రవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నా సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై గంటపాటు మోస్తారు వర్షం కురి సింది. ఐసీఎస్‌రోడ్డు, కోనేటిమిట్ట, ఆసుపత్రిరోడ్డు, అశోక్‌నగర్, మాళవ్యా నగర్ ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది.

బాలాయపల్లిలో...

బాలాయపల్లి: మండలంలో కురిసిన మోస్తరు వర్షంతో చిన్నచిన్న గుంటలు, కాలువల్లో నీరు చేరింది. వరి పంట చేతికి వచ్చే సమయంలో వర్షం పడడంతో నష్టాలకు దారి తీస్తుందని గాజులపల్లి, వెంగమాంబపురం, నిడిగల్లు గ్రామాలు రైతులు వాపోతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

గూడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు సుమన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సైద్ధాంతిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడమే కాకుండా విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వివేకానందస్వామిని ఆదర్శంగా తీసుకుని ఏబీవీపీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సోమశేఖర్, సత్యనారాయణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గూడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలిచెర్లరాజుపాళెం ఎస్టీ కాలనీలో శుక్రవారం తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారంతో చర్యలు చేపట్టారు. తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నామని ఎస్టీ కాలనీవాసులు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించేందుకు బోరు తవ్వించారని టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, సుబ్బరాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం నిరసన



నిరసన తెలుపుతున్న వీసీ అగ్రహారం రైతులు

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీ వీసీ అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. సాగరమాల పనులకు భూములిస్తే ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని అధికారులు పట్టించుకోవడంలేదని, తక్షణం స్పందించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక 9వ బెటాలియన్‌లో పెనుశిల క్షేత్రంలోని విజయేశ్వరి మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు.

యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది పరిసర ప్రాంతాల్లో ఇసుకను అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పట్టపగలే ఎక్స్‌వేటర్లతో ఇసుక తవ్వి తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా స్వర్ణముఖినదిలో రైల్వే బ్రిడ్జి పక్కనే ఇసుక తవ్వేస్తుండటంతో ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. అధికారులు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ఉన్నతి

పెళ్లకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దిగువ చావాలి సచివాలయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబం' కార్యక్రమాన్ని పెళ్లకూరు పీహెచ్‌సీ వైద్యుడు జితేంద్రతో కలసి నరేంద్రరెడ్డి ప్రారంభించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా అక్టోబరు 2 గాంధీ జయింతి వరకు గ్రామాల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి

క్రీడాకారులకు అభినందన



డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి ఉన్నత పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మస్తానయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయ తెలిపారు. ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు కోటలో మండలస్థాయి పోటీలు నిర్వహించారు. వాలీబాల్, చదరంగంలో అండర్ 14 విభాగంలో విద్యార్థులు ప్రతిభ చూపి డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం వారిని షీల్డులు, మెమొంటోలతో హెచ్‌ఎం, పీడీ అభినందించారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కండి



స్వచ్ఛత హీ సేవ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. సూళ్లూరుపేటను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని మున్సి పల్ కమిషనర్ చిన్నయ్య పిలుపునిచ్చారు. అక్టోబరు 2న గాంధీ జయంతి వరకు అన్ని వార్డుల్లో పరిశుభ్రతపై సచివాలయ సిబ్బంది అవగాహన కల్పిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభిం చిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సూళ్లూరు నాగరాజపురంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

డక్కిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సంగనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో రవీంద్రబాబు తనిఖీ చేశారు. అందరికీ పనులు కల్పిస్తున్నారా, ఉపాధి కూలి డబ్బులు సకాలంలో అందుతున్నాయా అని కూలీలను అడిగి తెలుసుకొన్నారు. ఉపాధి పనులకు రాకుండా మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్‌బీకేఆర్‌లో గ్నోసిస్ సదస్సు

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్నోసిస్ 2025 సామాజిక సింపోజియం సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. మహిళా సాధికారిత, వ్యవసాయంలో టెక్నాలజీ, సోషల్ మీడియా ప్రభావాలు, యోగా, జ్ఞానం, లీ లెర్నింగ్ వంటి అంశాలపై విద్యార్థులు పోస్టల్, పేపర్, ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ శ్రీనివాసులు, శివప్రతాప్‌రెడ్డి, డాక్టర్ హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఆఫ్ వికసిత్ భారత్‌ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మిషన్ ఆఫ్ వికసిత్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి రీజనల్ సెంటర్ డైరెక్టర్ రాఘవన్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ ప్రాంతీయ కేంద్రం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్తంగా సంస్కృత విశ్వవిద్యాలయంలో ఈనెల 22న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెయింటింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజన్ ఆఫ్ వికసిత్ భారత్ అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు బహుమతులు ఉంటాయని, వివరాలకు నెం.9866874963, 6303601422లలో సంప్రదించాలని కోరారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఇసుజు, జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి 125 మంది యువతి, యువకులు విచ్చేశారు. వీరందరికీ రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 60 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశానమని ఇసుజు కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్ తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు అజయ్ కుమార్, వంశీకృష్ణ, జేకేసీ కోఆర్డినేటర్స్ మధుబాబు, జీకే ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి



అబ్దుల్‌రహీంకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్‌రహీం అన్నారు. శుక్రవారం స్థానిక జీఎస్ రాయులు సెంటర్‌లోని మైనార్టీ కార్యాలయంలో అబ్దుల్‌రహీం పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గూడూరు నియోజకవర్గంలో ముస్లింల సంక్షేమానికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారం అందిస్తున్నారన్నారు. అందరం కలిసికట్టుగా ఉంటూ టీడీపీ పటిష్టతకు కృషి చేద్దామన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు అబ్దుల్ రహీంకు శుభాకాంక్షలు తెలిపారు.

పోషణపై అవగాహన

గూడూరు అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నమాజ్‌కట్ట ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ సుజన మాట్లాడుతూ పిల్లలు, తల్లల పోషణ, సంరక్షణలో పురుషులు భాగస్వామ్యం కావాలన్నారు. ఇది కుటుంబ బంధాన్ని బలంగా ఉంచుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్య సూచనలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జయశ్రీ, సుభాషిణి, షాజిదా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వేములపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీదేవి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీవో షంషాద్ బేగం అన్నారు. శుక్రవారం స్థానిక జంగాలపల్లి సచివాయలంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ పోషకాహారం తీసుకో వడంతో పాటు ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆకు కూరలు, పాలు, గుడ్డు ప్రతిరోజూ తీసుకోవాలన్నారు. అనంతరం బాలామృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బంగారుపేట పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్, పీఎస్ రమణయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

నాయుడుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు ముకుంద అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయుడుపేట సెజ్‌లోని చాలా పరిశ్రమల్లో యాజమాన్యాలు భద్రతా చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటీవల పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని పరిశ్రమల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు పోయాయని, సంబంధిత అధికారులు కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మస్తాన్‌రెడ్డి, కాలేషా, శంకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో గురుపూజోత్సవం



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్, విశ్రాంత వైస్ చాన్సలర్ సుధా, షార్ అధికారులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ డాక్టర్ సుధా సేషయన్ విచ్చేశారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షార్‌లోని అంతరిక్ష కేంద్రియ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను సన్మానించారు. షార్ కంట్రోలర్ జీ.రమేష్ బాబు, అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెరియన్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఆ పదవికి అనర్హుడు'

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ స్థానానికి కొట్టే సాయి ప్రసాద్ అనర్హుడని జనసేన మాజీ ఇన్‌ఛార్జి వినుత పేర్కొన్నారు. ఈ మేరకు జనసేనాని పవన్ కల్యాణ్‌కు శుక్రవారం ఆమె బహిరంగ లేఖ రాశారు. తనను రాజకీయంగా అణగదొక్కే కుట్రలు చేసిన వారిలో ఇతడు ప్రధాన సూత్రధారి అని ఆరోపించారు. మహిళలపై గౌరవప్రదంగా మెలిగే వారికి ఈ పదవి ఇవ్వడం సమంజసమన్నారు.

ఘనంగా శ్రీసిటీ-రాక్‌వర్త్ పరిశ్రమ వార్షికోత్సవం


విద్యార్థులతో రాక్‌వర్త్ ఎండీ శైలేష్ కుమార్ సింగ్

సత్యవేడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఫర్నిచర్ తయారీ పరిశ్రమ రాక్‌వర్త్ సిస్టమ్స్ ఫర్నీచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో శుక్రవారం వార్షికోత్స వాలను ఘనంగా నిర్వహించారు. పరిశ్రమ ప్రారంభించి 14 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంస్థ ఉద్యోగులందరికీ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో శైలేష్ కుమార్ సింగ్ తనతల్లి జ్ఞాపకార్థం మీనాదేవి మెమోరియల్ ట్రస్ట్ పేరిట విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పరిశ్రమకు చెందిన ఉద్యోగుల పిల్లలు 40 మందికి, పరిసర గ్రామాలకు చెందిన ఇతర పిల్లలు మరో 25 మందికి రూ. 30లక్షల విద్యా ఫీజులను చెల్లించి, రసీదులను విద్యార్థులకు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 65మంది విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిపొందగా, రాబోయే ఏడాది ఈ సంఖ్యను 100 మందికి పెంచాలన్నది తన సంకల్పంగా ప్రకటించారు. తమ సంస్థ సామాజిక బాధ్యత పట్ల కట్టుబడి ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడేలా కృషి చేస్తామని తెలిపారు.

ఆనందవల్లికి వెండి పాదాల బహూకరణ


వెండి పాదాలను అందిస్తున్న నాగరాజు కుటుంబ సభ్యులు

ఏర్పేడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో ఆనందవల్లి దేవికి 318 గ్రాముల వెండి పాదాలను శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన నాగరాజు కుటుంబ సభ్యులు గురువారం ఆలయ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అధికారులు స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల సేవ



నారాయణవనం, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా ఉదయం నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టా చార్య, ఆలయాధికారి నాగరాజు సేవను పర్యవేక్షించారు.

రికార్డుల పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరులో ఏపీఐఐసీకి భూములు ఇచ్చి పరిహారం కోసం ఎదురు చూస్తున్న వారి రికార్డులను పరిశీలించారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆలత్తూరు ఇప్పటికే కొంతమంది రైతులకు పరిహారం చెల్లించామని తెలిపారు. పట్టాదారు రికార్డులు సక్రమంగా లేకపోవడం, భూవివాదాలు వంటి కారణాలతో 80 మంది రైతులకు పరిహారం అందించలేదని తెలిపారు. గ్రామ సభలో విచారించి రికార్డులను పరిశీలించి త్వరలోనే పరిహారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత తీర్చి రైతులను ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ విభాగం, డీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. యూరియా కృత్రిమ కొరతతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు, కిసాన్ విభాగా జిల్లా అధ్యక్షుడు జనార్దన రెడ్డి, తలపా దామోదర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పిచ్చాటూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచ్చాటూరు, వేలూరు, గోవర్ధనగిరి, కారూరు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ ఆపండి: ఏఐఎస్ఎఫ్


ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యను ప్రైవేటీకరణ ఆపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అభి, శివ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.6,400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకపోగా అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన రూ.600కోట్లు కేవలం పేపర్ ప్రకటనకే పరిమిత మైందన్నారు. వైద్య విద్యలో పీపీపీ విధానం తీసుకువచ్చి పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందనిద్రాక్షలా ప్రైవేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థి సంఘ నాయకులు విద్యాసంస్థల్లో ప్రవేశించకుండా తీసు కువచ్చిన ఉత్తర్వులను రద్దు చేయా లన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచాల న్నారు. ముఖేష్, చైతు, సల్మాన్, షాహిద్, హని, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ విధానం రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న రైటర్లు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దస్తావేజుల తయారీలో ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని, చెక్ స్లిప్ ఎడిట్ ఆప్షన్ పునరుద్ధరించి ప్రజల సమస్యలను తొలగించాలని డాక్యుమెంటు రైటర్లు కోరారు. శుక్రవారం శ్రీకాళహస్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంటు రైటర్లు, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 19, 20 తేదీల్లో పెన్‌డౌన్‌లో భాగంగా ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఓటీపీల ద్వారా ఎన్నో ఆర్థిక లావాదేవీలు పక్కదారి పడుతున్న పరిస్థితుల్లో దస్తావేజుల తయారీలో ఓటీపీల కారణంగా రైటర్లను అనుమానంతో చూస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఓటీపీ విధానాన్ని రద్దు చేసి కార్డు ప్రైమ్ 2.0 విధానంలో ఎడిట్ ఆప్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. ప్రైవేటు అటెండెన్స్ విధానం కాకుండా పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. అనంతరం శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. దస్తావేజుల లేఖకులు ఉమామహేశ్వరరావు, చంద్ర, సూర్యప్రకాష్, శ్యామరాజ్, స్టాంపు వెండర్లు చెంచు క్రాంతి కుమార్, మణి, కిరణ్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎస్ఎంయూఏ శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో అధ్యక్షుడు జొన్నలగడ్డ మురళి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బస్టాండులో ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డిపోలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు.

వీఆర్ఏల ధర్నా



వరదయ్యపాళెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ.. వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, నామినీ వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, రూ.21వేలు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

మహిళలు ఆర్థికంగా పరిపుష్టి చెందాలి

డ్వాక్రా సభ్యులకు కోడిపిల్లల పంపిణీ


కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

రేణిగుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా పరిపుష్టి చెందాలని ఏపీఎం కోమలాదేవి కోరారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం డ్వాక్రా సభ్యులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... తొమ్మిది యూనిట్లను, మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్ర, సహకార సంఘం చైర్మన్ భాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, నాయకులు మోహబూబ్‌బాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, నాదమునిరెడ్డి, మునస్వామి నాయుడు, పుష్పనాథం, రాజశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి, షేక్ నవాబ్, బీజేపీ నాయకుడు బీడీబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రండి

● జిల్లా పరిశ్రమల శాఖ డీడీవో మురళి

రేణిగుంట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : చిన్న, సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు మహిళలు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల శాఖ డీడీవో మురళి పిలుపునిచ్చారు. రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో పీ4 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో ఒకరు పారిశ్రామికవేత్త కావాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ మేరకు పరిశ్రమల ఏర్పాటుకు ఇస్తున్న ప్రోత్సాహకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజరు లోకనాథం, ఐపీవోలు అనీల్‌కుమార్, హరికృష్ణ, కుమార్, ఏపీఎంలు వాసు, సూరి, కోమలాదేవి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి సహకరించండి

మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి

పిచ్చాటూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణం చేపట్టాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్, ఇంటర్ బోర్డు డైరెక్టర్ భరత్‌గుప్తాకు విన్నవించారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశం అనంతరం సాయంత్రం వారిద్దరినీ మర్యాదపూర్వకంగా కలిపి వినతిపత్రం అందజేశారు. ఈ జూనియర్ కళాశాలకు ఒకవైపు అరణియార్ జలాశయం, మరో వైపు జాతీయ రహదారి ఉండడం వల్ల విద్యార్థులు నిత్యం ప్రమాదాల మధ్య చదువుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. తక్షణం స్పందించి పిచ్చాటూరు జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

కొలతల్లో జాగ్రత్తలు పాటించండి

కేవీబీపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణ డీలర్లు పేద ప్రజలకు ఇచ్చే సరుకుల విషయంలో తూనికలు, కొలతల్లో జాగ్రత్తలు పాటించాలని తహసీల్దారు రోశయ్య ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సాధారణ తూనికల యంత్రాలు కాకుండా ఆటోమెటిక్ యంత్రాలు, స్మార్ట్‌రేషన్‌కార్డు వినియోగం జరుగుతుందన్నారు. డీలర్లు ముందుగానే లబ్ధిదారుడి కార్డును పరిశీలించి సరైన తూకంతో సరుకులు పంపిణీ చేయాలన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకారవేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉపాధిశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న బీడీ కార్మికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు సంబంధించి 2025-26 విద్యా సంవత్సరానికి ఉపకారవేతనాలు అందజేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాళహస్తి బీడీ కార్మికుల వైద్యాధికారి వెంకట భాస్కర్ తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అక్టోబరు 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శ్రీసిటీ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసులు

సత్యవేడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బి.వి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించిన వైడేశ్వరరావు ఇటీవల పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే. దీం తో గతకొద్ది రోజులుగా ఇక్కడ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఇదే పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించిన శ్రీనివాసులుకు ప్రభుత్వం డీఎస్పీగా పదోన్నతి కల్పించింది.

మహిళల ఆరోగ్యానికి భరోసా


హనుమంతాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌తో మహిళల ఆరోగ్యానికి భరోసా అని వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ద్వైత అన్నారు. మండలంలోని కడూరులో జరిగిన కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన నిర్వహిం చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప, సీహెచ్‌వో కృష్ణంరాజు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. పాండూరులో చిన్నపాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్ ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కవిత, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమంతాపురం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ధనుష్ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి ప్రణాళికతో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. త్వరలో ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులను అందిస్తారన్నారు. డాక్టర్ ధనంజయలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బజావతి, సుమతి, సామాజిక ఆరోగ్య అధికారి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం


ఏర్పేడు, పాలమంగళం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రారంభమైన పోటీలు

ఏర్పేడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంఈవో 2 దయాకర్ ప్రారంభించారు. సుమారు 400మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో అండర్ -14, 17 బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ప్రతిభ కనబరచిన విద్యార్థులను జిల్లాస్థాయి ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు సర్పంచ్ శివయ్య, విద్యార్థులకు బహుమతులు స్పాన్సర్ చేసిన రమేష్, పాఠశాల హెచ్‌ఎం మునిలక్ష్మి, పీడీలు మణి, జయచంద్ర, లోకేష్, వెంకటేశులు, శ్రీనివాసులు, సోము, పుష్పవాణి, వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని పాలమంగళం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శివాజీ గణేశన్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు క్రీడా పోటీలను నిర్వహించారు. క్రీడల మండల కోఆర్డినేటర్ రాజా, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్, హరి, వెంకటేష్, జయప్రద, రుక్మిణి, విద్యార్థులు పాల్గొన్నారు.